

న్యాల్‌కల్: ముంగి గ్రామ శివారులోని చెరకు పంటలో నిలిచిన నీరు



న్యాల్‌కల్: పొంగిపొర్లుతున్న బసంత్‌పూర్ వాగు



జహీరాబాద్: వసంత్‌విహార్ కాలనీలో..

ముంచెత్తిన వాన

జిల్లావ్యాప్తంగా గత రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో కాలనీలు, రహదారులు జలమయంగా మారాయి. వాగులు, వంకలు వర్షం నీటితో పొంగిపొర్లుతున్నాయి. వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో పత్తి, సోయా, పెసర, మినుము తదితర పంటలకు ప్రాణం పోసినట్లయింది. చాలా రోజుల తర్వాత వర్షం కురుస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- సాక్షి నెట్‌వర్క్



జహీరాబాద్: చెరకు, సోయాబీన్, పత్తి పంట పొలాల్లోకి చేరిన వరదనీరు



జహీరాబాద్ టౌన్: డ్రీమ్‌వ్యాలీలో వరద నీటిని జేసీబీ సాయంతో బయటకు పంపుతున్న సిబ్బంది



కంగ్టి: బాన్సువాడ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కాకివాగు

క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన పటాన్‌చెరు మండల ఉపాధ్యాయుడు సుందర్‌రావును సోమవారం బీహెచ్‌ఈఎల్ జ్యోతి విద్యాలయ పాఠశాలలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ గణిత ఫోరం జిల్లా అధ్యక్షుడు సిద్దారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాథోడ్, టీఎంఎఫ్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు రామలింగారెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు సౌభాగ్య, ఉపాధ్యాయులు రాములు, రాంబాబు పాల్గొన్నారు.

తడ్కల్ మండల ఏర్పాటుపై సంబురాలు



ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కంగ్టి(నారాయణఖేడ్): నారాయణఖేడ్ నియోజకవర్గంలోని తడ్కల్‌ను నూతన మండలంగా ఏర్పాటు చేయడంతో సోమవారం ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు ఎస్కె గంగారాం, సర్పంచ్ మనోహర్, నాయకులు గుర్రపు నారాయణ, ఘన్‌పూర్ పార్టీ అధ్యక్షుడు కృష్ణ, మండల రైతు సమన్వయకర్త కోట ఆంజనేయులు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ

రాయికోడ్(అందోల్): మండల కేంద్రం రాయికోడ్‌కు చెందిన 12మంది లబ్ధిదారులకు సోమవారం ఎంపీపీ మమత, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సిద్దప్పపాటిల్ నాయకులు, పశువైద్య సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేశారు. ఆత్మ కమిటీ చైర్మన్ విఠల్, వరము వైస్ చైర్మన్ తుకారామ్ పశుసంవర్ధకశాఖ వీఎల్‌ఓ అలీమొద్దీన్, గోపాలమిత్ర శివకుమార్, ఓఎస్ కృష్ణ పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

వట్‌పల్లి(అందోల్): రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే అధికారమని డిప్యూటీ మాజీ సీఎం, దామోదర రాజనర్సింహా అన్నారు. సోమవారం అందోల్ మండల పరిధిలోని నాదులాపూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పీసీసీఎస్ నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కలాలి రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

సజ్జరావుతండా చెరువుకు గండి



జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని సజ్జరావుపేట తండా పీర్లగుట్ట చెరకువుకు గండి పండింది. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి చెరువులోకి భారీగా వరద నీరు వచ్చింది. దశాబ్దాల క్రితం నిర్మించిన చెరువుకు మరమ్మతులు లేక కట్ట దెబ్బతినడంతో కట్టతెగి గండి పడింది. దీంతో చెరవు కింద ఉన్న పంట పొలాలు నీట మునిగాయి. విషయాన్ని నీటిపారుదల శాఖ, రెవెన్యూ అధికారులకు తెలిపినా స్పందించడంలేదని గిరిజనులు వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే చెరువుకు పడిన గండిని పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

మొక్కలు నాటేలా అవగాహన



మొక్కను అందజేస్తున్న ఉపాధ్యాయుడు సత్యం

జిన్నారం(పటాన్‌చెరు): నేటి సమాజంలో యువత పుట్టిన రోజులను జల్సాలు చేస్తూ జరుపుకుంటున్నారు. పబ్బులు, రిసార్టులల్లో పుట్టిన రోజులు జరుపుకునే సంస్కృతిని చూస్తున్నాం. ఇందుకు భిన్నంగా జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణితం బోధిస్తున్న ఉపాధ్యాయుడు పైసా సత్యం విద్యార్థుల పుట్టిన రోజున మొక్కను నాటించేవిధంగా అవగాహన కల్పిస్తున్నాడు. ఇప్పటివరకు పాఠశాల ఆవరణతో పాటు విద్యార్థుల ఇళ్ల వద్ద రెండు వేల వరకు మొక్కలను నాటించేలా ప్రోత్సహించాడు. పైసా సత్యం చేస్తున్న కృషిని అభినందిస్తున్నారు.

రూ.2 కోట్లతో ఉసికేబావి వంతెన నిర్మాణం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



పటాన్‌చెరు: ఉసికేబావి వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: దశాబ్దకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉసికేబావి కల్వర్టు నిర్మాణానికి రూ.2కోట్ల నిధులతో శాశ్వత పరిష్కారం చూపనున్నట్టు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని 14వ వార్డు పరిధిలోని ఉసికేబావి నుంచి రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని జాతీయ రహదారికి అనుసంధానంగా చేపట్టనున్న వంతెన పనులకు, అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని నవ్యకాలనీ, గ్రీన్ మెడోస్, గ్రీన్ ఫీల్డ్ కాలనీలలో రూ.2.95కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ వంతెన నిర్మాణం పూర్తయితే 30 కాలనీలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్‌చైర్మన్ నరసింహగౌడ్, కౌన్సిలర్లు కవితాశ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, చంద్రకళ గోపాల్, బాలమణిబాలరాజు, ప్రమోద్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు యూనూస్, బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయం కమిటీ చైర్మన్ తులసిరెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగుల దేవుడు సీఎం కేసీఆర్

పటాన్‌చెరు టౌన్: దివ్యాంగుల దేవుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో దివ్యాంగుల పెన్షన్ లబ్ధిదారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వం ఇటీవల పెంచిన పెన్షన్ ప్రొసీడింగ్ పత్రాలను దివ్యాంగులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, ఎంపీపీలు దేవానందం, ప్రవీణవిజయభాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీలు సుధాకర్‌రెడ్డి, సుప్రజావెంకట్‌రెడ్డి, కుమార్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్లు లలితాసోమిరెడ్డి, రోజాబాల్‌రెడ్డి, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడకు చెందిన బాయమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ద్వారా సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రూ.2లక్షలు విలువచేసే ఎల్‌ఓసీ సోమవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి బాయమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రాజు, వెంకటేష్‌గౌడ్, అశోక్, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పటాన్‌చెరు: డివిజన్ పరిధిలోని భాష్యం స్కూల్ సమీపంలో రూ.42లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న యూజీడీ పనులు, కుమ్మరి బస్తీలో రూ.16లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు సోమవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ మాణిక్యం పాల్గొన్నారు.

నీలం మధుకు అండగా ఉంటాం



మహిళలతో మాట్లాడుతున్న నీలం మధు

జిన్నారం(పటాన్‌చెరు): చిట్కుల్ సర్పంచ్ నీలం మధుకు తాము అండగా ఉంటామని గుమ్మడిదల గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపారు. సోమవారం గుమ్మడిదల గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నర్సింహులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా నీలం మధుకు పూర్తి మద్దతు ఇవ్వాలని తీర్మానించారు. అనంతరం నీలం మధును నాయకులు, మహిళలు కలిసి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆంజనేయులు, నాగయ్య, మల్లేశ్, శ్రీశైలం, పాండు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా గెలిపిస్తాం

పటాన్‌చెరు టౌన్: ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపకులు నీలం మధు సబ్బండ వర్గాల తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయాల్సిందే అని పటాన్‌చెరు మండలంలోని రామేశ్వరంబండ, గుమ్మడిదల గ్రామాల ప్రజలు సోమవారం నీలం మధు నివాసానికి చేరుకుని మద్దతు ప్రకటించారు.

పర్మినెంట్ చేయాలి

కొండాపూర్(సంగారెడ్డి): సమగ్ర శిక్ష అభియాన్‌లో కాంట్రాక్ట్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఆ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సంగారెడ్డిలోని కలెక్టరేట్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి పర్మినెంట్ చేయాలన్నారు. అదేవిధంగా ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలు, ప్రమాద బీమా రూ.5లక్షల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

బస్సు సౌకర్యం కల్పించాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

జిన్నారం(పటాన్‌చెరు): ఉదయం, సాయంత్రం వేళల్లో ఆర్టీసీ బస్సులు లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారం గ్రామ ప్రధాన రహదారిపై విద్యార్థులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా విద్యార్థులు ఆర్టీసీ బస్సులను ఆపేస్తూ ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ప్రజా ప్రతినిధులు కల్పించుకొని బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీనివ్వడంతో ఆందోళన విరమించారు.

కూతురు అదృశ్యంపై తల్లి ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: కూతురు అదృశ్యంపై తల్లి ఫిర్యాదు చేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అమీన్‌పూర్ పరిధిలోని నరగ్రూడెంలో కేటీఆర్ నగర్‌కు చెందిన చెప్పలి దేవి కూతురు జ్యోతి(19)ఇంటర్ వరకు చదివి ఇంటివద్దే ఉంటుంది. ఈ క్రమంలో ఈ నెల మూడో తేదీ రాత్రి కుటుంబ సభ్యులు నిద్రకు ఉపక్రమించగా ఇంట్లో ఎవరికీ చెప్పకుండా జ్యోతి వెళ్లిపోయింది. దీంతో కూతురు కోసం తల్లి బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కూతురు అదృశ్యంపై సోమవారం తల్లి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యాపిల్లల అదృశ్యంపై భర్త ఫిర్యాదు

భార్యాపిల్లలు అదృశంపై భర్త ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన దినేష్ 10ఏళ్ల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడకు వచ్చి ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో దినేష్ సోమవారం డ్యూటీకి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా భార్య గూటిదేవి ఇద్దరు పిల్లలు గణేష్(11), వినీత్(8) కనిపించలేదు. సోమవారం భర్త దినేష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **బీఎల్‌ఓలకు కిట్ బ్యాగ్‌లు పంపిణీ**



కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని గ్రామ పంచాయతీలు, తండాల్లో బీఎల్‌ఓలుగా విధులు నిర్వహిస్తున్న 43 మందికి డిప్యూటీ తహసీల్దార్ జుబేర్ అహ్మద్ సోమవారం బీఎల్‌ఓల ప్రత్యేక కిట్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిట్‌లలో సంబంధిత గ్రామాల ఓటరు లిస్ట్, ఇటీవల నూతనంగా చేర్పిన ఓటర్ల వివరాలు, మార్పిడి వివరాలు పొందుపర్చినట్లు తెలిపారు.

◆ **వీరభద్రస్వామి ఆలయంలో పూజలు**



జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడ(బొంతపల్లి) గ్రామంలోని భద్రకాళీ సమేత వీరభ్రధస్వామి దేవాలయంలో శ్రావణ సోమవారం భక్తులు బారులు తీరారు. సికింద్రాబాద్‌లోని అక్షయ పాత్ర సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహకులు రంజిత్, వెంకటరమణ, వెంకట్, నవీన్, యాటేశ్, రామకృష్ణల ఆధ్వర్యంలో రెండో రోజు రెండు వేలమంది భక్తులకు అన్నదానం చేశారు.

◆ **అఖండ అతిరాత్ర రుద్రాభిషేకం వాయిదా**

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మార్వాడి గల్లీలోని కాశీనాథ్ ఆలయంలో సోమ, మంగళవారాల్లో నిర్వహించాల్సి ఉన్న అఖండ అతిరాత్ర రుద్రాభిషేకం వాయిదా వేసినట్లు ఆలయకమిటీ బాధ్యులు తెలిపారు. భారీవర్షాలు కురుస్తుండటంతో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా వాయిదా వేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

◆ **పరామర్శ**

నారాయణఖేడ్: నిజాంపేట్ మండలం దామరచెరువు గ్రామానికి చెందిన బాలయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబీకులు హైదరాబాద్ హైటెక్ సిటీలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సోమవారం బాలయ్యను పరామర్శించారు.

వినూత్నంగా ఆత్మీయ సమ్మేళనం

- ముఖ్య అతిథిగా సీఎం చిత్రపటం
- ముఖ్యమంత్రి కరుణించాలని ప్రార్థనలు



సీఎం చిత్రపటం ఎదుట వినతిపత్రాలు చూపుతున్న ఢిల్లీ వసంత్, రైతులు

జహీరాబాద్ టౌన్: గతంలో చెరకు రైతుల సమస్యల కోసం ఉద్యమించి ఢిల్లీ వరకు పాదయాత్ర చేసిన బీఆర్‌ఎస్ నాయకులు ఢిల్లీ వసంత్ చక్కెర కర్మాగార పరిరక్షణ కోసం మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ట్రైడెంట్ షుగర్ ఫ్యాక్టరీ సమస్యల పరిష్కారానికి వినూత్న రీతిలో ×మట్టి మనుషుల మనోగతం–భూమి పుత్రుల ఆకలికేక× పేరుతో ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం పట్టణంలోని షెట్కార్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకుని ఈ కార్యక్రమానికి సీఎం కేసీఆర్‌ను ముఖ్యఅతిథిగా ఆయన చిత్రపటాన్ని కుర్చీపై ఉంచారు. ఆత్మీయ సమ్మేళనానికి రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులను పిలకుండా నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి మట్టి నమోనాలను సేకరించి గ్రామాలనే నాయకులుగా భావించి కుర్చీలపై పెట్టారు. దళితబంధు పథకంతో చక్కెర కర్మాగారాన్ని సొంత చేసుకొనే అవకాశం ఉందని, లబ్దిదారులను షేర్ హోల్డర్లగా చేయాలని కోరుతూ కేసీఆర్ చిత్రపటానికి వినతి పత్రం అందజేశారు. సీఎం కేసీఆర్ కరుణించాలని 72గంటల పాటు నిర్వహించే సామూహిక ప్రార్థనలను ప్రారంభించారు. ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందో తెలుసుకుని ఆ తరువాత తదుపరి కార్యచరణ ప్రకటిస్తామని ఢిల్లీ వసంత్ తెలిపారు. అంతకుముందు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఎడ్లబండ్లతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మాజీ సర్పంచ్ మృతి



నర్సింహులు(ఫైల్)

న్యాల్‌కల్(జహీరాబాద్): అనుమానస్పద స్థితిలో మాజీ సర్పంచ్ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని టేకూర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. హద్నూర్ ఎస్ఐ రామానాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. రాయికోడ్‌కు చెందిన నర్సింహులుకు టేకూర్‌కు చెందిన అనుసూయతో 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. నర్సింహులు రాయికోడ్‌లో మార్కెట్ వద్ద అర్తి వ్యాపారం చేసుకుంటూ ఉంటూ టేకూర్‌లోని అత్తగారింటి వద్ద ఉండేవాడు. ఈ నెల 31న భార్య అనుసూయ, అత్త అంజమ్మ రాఖీ పౌర్ణమికి బీరంగూడకు వెళ్లగా నర్సింహులు ఇంటి వద్దే ఉన్నాడు. ఈ క్రమంలో భార్య నర్సింహులుకు పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ లిఫ్ట్ చేయలేదు. సోమవారం ఉదయం కూలీలు కూలి డబ్బుల కోసం నర్సింహులు ఇంటికి వచ్చి ఎంత పిలిచినా పలుకలేదు. దీంతో ఇరుగుపొరుగువారికి ఈ విషయం చెప్పగా వచ్చి ఇంటి తలుపులు తీయగా శవమై కనిపించాడు. 2009లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నిల్లో నర్సింహులు సర్పంచ్‌గా గెలుపొందారు. భర్త మృతిపై భార్య అనుమానం వ్యక్తం చేసింది. మృతుడి భార్య అనుసూయ ఫిర్యాదుతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

సంగారెడ్డి టౌన్: గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం... పోతిరెడ్డిపల్లి చౌరస్తా బస్టాండ్ ఆవరణలో గత నెల 30న గుర్తుతెలియని వ్యక్తిపడిపోయి ఉండటంతో గమనించిన పలువురు చికిత్స నిమిత్తం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుడి చేతిపై చందు అని, డమరుకం గుర్తులు పచ్చబొట్టుతో ఉన్నాయని, మృతుడిని ఎవరైనా గుర్తుపడితే 8712656719, 8712656746 నెంబర్లకు సంప్రదించాలని పోలీసులు సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ సురేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... పటాన్‌చెరు మండలంలోని ఇస్నాపూర్ విజేత కాలనీకి చెందిన వీరేశం(32) కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆగస్టు 28న ముత్తంగి నుంచి ఇస్నాపూర్ నడుచుకుంటూ వెళ్తుండగా బైక్ ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ వీరేశంను చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బాధిత కుటుంబానికి అప్పజెప్పారు. మృతుడి భార్య లత సోమవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో గొర్రెపిల్లలు మృత్యువాత



మృతి చెందిన గొర్రెపిల్లలు

ఝరాసంగం(జహీరాబాద్): కుక్కల దాడిలో గొర్రెపిల్లలు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గంగాపూర్ గ్రామానికి చెందిన నర్సింహులు గొర్రెలు మేపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు., రోజు మాదిరిగానే సోమవారం గొర్రెలను మేపేందుకు పొలం వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో ఇంటి వద్ద ఏర్పాటు చేసిన రేకులషెడ్డులో ఉన్న గొర్రెపిల్లలపై కుక్కలు దాడి చేయడంతో 18 గొర్రెపిల్లలు మృతి చెందగా మరి కొన్ని గాయపడ్డాయి. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని గడ్డపోతారం గ్రామ పంచాయతీ పరిధిలో ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరుతూ సర్పంచ్ ప్రకాశ్‌చారి సోమవారం జిల్లా కలెక్టర్‌తో పాటు అడిషనల్ కలెక్టర్, ఆర్డీఓలకు విన్నవించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌చారి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలోని 300మంది నిరుపేదలకు ఇళ్లు లేవన్నారు. సర్వేనంబర్ 79లో నిరుపేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరామన్నారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు.